కొర్లపహాడ్‌లో ట్రామాకేర్ సెంటర్ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

కొర్లపహాడ్‌లో ట్రామాకేర్ సెంటర్‌కు భూమిపూజ

- **సెప్టెంబర్‌లో 'హైదరాబాద్-విజయవాడ' పనులు ప్రారంభం**
- **రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

కేతేపల్లి, జూలై 8: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన బాధితులకు తక్షణ వైద్య సాయం అందించేందుకు ట్రామాకేర్ సెంటర్ నిర్మిస్తున్నట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద ఏడీపీ సంస్థ సహకారంతో రూ.5 కోట్లతో నిర్మించనున్న ట్రామాకేర్ సెంటర్‌కు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. రెండు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేయడంతో పాటు అత్యాధునిక వైద్య పరికరాలను సెంటర్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ప్రమాదం జరిగిన గంటలోపు వైద్యం అందించడమే ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణకుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, కలెక్టర్ నారాయణరెడ్డి, ఏడీపీ సంస్థ ఎండీ విజయ్, ఎస్పీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి బాధితులకు న్యాయం చేస్తాం

- **నిందితుల ఆస్తులు అటాచ్**
- **4 వేల మంది బాధితుల నుంచి 514 కోట్ల వసూలు చేసిన కమలాకర్‌శర్మ**
- **బాధితులతో సీసీఎస్ డీసీపీ శ్వేత సమావేశం**

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): అధిక వడ్డీలు ఇస్తామంటూ మాటలు చెప్పి వేలాదిమంది నుంచి లక్షల డిపాజిట్లు సేకరించి మోసం చేసిన ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ (డీఎఫ్‌ఐ) కేసు బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపారు. సోమవారం ఆమె బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కన్ఫరెన్స్ హాల్‌లో బాధితులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సురాల నర్సింహమూర్తి గత ఏడాది డిసెంబర్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీఎస్‌లో సెక్షన్ 406, 420 రెడ్‌విత్ 34 ఐపీసీ, తెలంగాణ స్టేట్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుల్లో ఒకరైన ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ పీ కమలాకర్‌శర్మ, మరికొందరు కలిసి బ్రాహ్మణ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని సుమారు నాలుగు వేల మంది బాధితుల నుంచి రూ.514 కోట్లు వసూలు చేశారని వెల్లడించారు. కేసు దర్యాప్తు ఆర్థిక నేరాల విభాగం టీమ్-6 ఏసీపీ ఆదిరా నారాయణ నేతృత్వంలో కొనసాగుతున్నదని తెలిపారు. డీఎఫ్‌ఐ కేసు దర్యాప్తులో నిందితులకు సంబంధించి 450 ఎకరాల స్థలంతో పాటు మూడు వేల గజాల కమర్షియల్ స్థలాన్ని గుర్తించామని తెలిపారు. ఈ ఆస్తులను అటాచ్ చేసేందుకు కోర్టు నుంచి కొన్నింటికి అనుమతి లభించిందని, మరికొన్నింటికి అనుమతి రావాల్సి ఉన్నదని వివరించారు. 30 బ్యాంకు ఖాతాలను గుర్తించి ఫ్రీజ్ చేశామని, ఫోరెన్సిక్ ఆడిట్ కూడా పూర్తి చేశామని వివరించారు. బాధితులకు సీసీఎస్‌లో తనతో పాటు దర్యాప్తు అధికారి ఏసీపీ అందుబాటులో ఉంటారని డీసీపీ పేర్కొన్నారు.

కూల్చివేసిన ఇండ్లు

ప్రభుత్వ తీరుకు నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

పేదల ఇండ్లపైకి కాంగ్రెస్ బుల్డోజర్

అన్ని అనుమతులు ఉన్నా పీర్జాదిగూడలో కూల్చివేత

- **2008లోనే కాంగ్రెస్ పాలనలో ప్లాట్ల క్రమబద్ధీకరణ.. ఎన్వోసీ**
- **ఇప్పుడు సీలింగ్ ల్యాండ్ అంటూ రాజకీయ వేధింపులు**
- **ఎంపిక చేసుకొని మరీ కూల్చివేతలు.. అడ్డుకున్న మేయర్**
- **కూల్చివేతలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం**
- **పేదల ఇండ్లు కూల్చుడే కాంగ్రెస్ లక్ష్యమా?: ఎంపీ ఈటల**

మేడ్చల్, హైదరాబాద్ జూలై 8 (నమస్తే తెలంగాణ): అన్ని అనుమతులూ ఉన్నాయి. స్థలాల క్రమబద్ధీకరణ కూడా జరిగింది. రెవెన్యూ అధికారులు ఎన్వోసీ కూడా ఇచ్చారు. మున్సిపాలిటీ కూడా ఓకే చెప్పింది. గృహరుణాలకు అనుమతి కూడా లభించింది. అయినా సరే కేవలం రాజకీయ కక్ష వేధింపుల్లో భాగంగా ఓ కాంగ్రెస్ నేత కనుసన్నల్లో ఎంపిక చేసుకొని మరీ ఆ ఇళ్లను కూల్చివేశారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో సోమవారం వందల మంది పోలీసుల పహారాలో యథేచ్ఛగా ఇండ్లను పడగొట్టారు. కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సర్వే నంబర్ 1లో అనేకమంది 30-40 ఏండ్ల కిందటే ప్లాట్లు కొనుగోలు చేశారు. వీటిని 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసింది. రెవెన్యూ అధికారులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. గృహ రుణాలు తీసుకునేందుకు వీలు కల్పించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా వీరికి ఎలాంటి చిక్కులు లేకుండా ఉండేలా ఆ ప్లాట్లను 118 జీవో పరిధిలో చేర్చి, ప్లాట్ల యజమానులకు మేలుచేసింది. దాదాపు 300 మందికి పైగా నిరుపేదలు, చిరుద్యోగులు ఇండ్ల నిర్మాణం చేపట్టారు. కాగా, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్గదర్శనంలో సోమవారం తెల్లవారుజామున ఐదింటికే ఆ ఇండ్లను నేలమట్టం చేశారు. తహసీల్దారు హసీనా ఆధ్వర్యంలో కూల్చివేతల పర్వం జరిగింది. ఇక్కడ వందల ఇండ్లను నిర్మిస్తున్నా అధికారులు సీలింగ్‌ల్యాండ్ ఉందంటూ కొన్నింటినే లక్ష్యంగా చేసుకొని కూల్చివేతలు మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కాలనీవాసులు, ప్రజలు సంఘటనాస్థలానికి వెళ్లి, అడ్డుకునే ప్రయత్నం చేశారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని కిందపడేసి లాక్కెళ్లి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. బీఆర్‌ఎస్ నేత బండారి రవీందర్, కార్పొరేటర్లు కొల్లూరి మహేశ్, బచ్చ రాజు, మద్ది యుగేందర్‌రెడ్డి, కొడె పోచయ్య, అనంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, నాయకులు రఘుపతి రెడ్డి, బండి సతీశ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, జావీద్‌ఖాన్ తదితరులు కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించారు.

కాంగ్రెస్ వేధింపులకు వడ్డీతో సహా చెల్లిస్తాం: కేటీఆర్

కూల్చివేతల విషయాన్ని తెలుసుకున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను వడ్డీతో సహా చెల్లిస్తామని, ప్రజాపరిపాలన పేరుతో ప్రజల ఆస్తులను కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నదని ఎక్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కాంగ్రెస్ నాయకులు అమ్మిన, కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించిన ప్లాట్లలో నిర్మించుకున్న ప్రజల ఇండ్లను మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఏమి ఆశించి ఈ రోజు కూలగొట్టించాడో సీఎం రేవంత్‌రెడ్డి ఒకసారి విచారణ చేయించాలి. ప్రజలకు మద్దతుగా నిలిచిన బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు నిర్బంధించడం అరాచకం. మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో సుధీర్‌రెడ్డి చేస్తున్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండి. లేదంటే ప్రజలు తిరగబడుతారు. మీ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవు. అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మింది కాంగ్రెస్ నాయకుడు రాందాస్‌గౌడ్, మరో కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్‌సింగ్ కుటుంబం. ఈ ప్లాట్లను 2008 నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా గతంలోనే ఎన్వోసీ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపాలిటీ అధికారుల అనుమతి తీసుకొని చాలామంది ప్రజలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొన్నారు. ఇంటి నిర్మాణాలు చేసుకుంటున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారులను వేధించి అమాయకుల ఇండ్లను కూలగొట్టించాడు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియ, సత్యనారాయణపురం కాలనీ ప్లాట్ల యజమానుల సమస్యను శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో నాడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 118 జీవో పరిధిలో చేర్చి, ప్లాట్ల యజమానులకు మేలుచేసింది. కానీ ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వం అమాయక ప్లాట్ల యజమానుల ఇండ్లను కూల్చివేస్తున్నది. ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షగట్టి వేధింపులకు పాల్పడుతున్నది. దీనికి ముగింపు పలకడం ఖాయం. భవిష్యత్తులో మా బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్లాట్ ఓనర్లకు కచ్చితంగా న్యాయం చేస్తాం. మా బీఆర్‌ఎస్ పార్టీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని, కార్పొరేటర్లను మీరు వేధిస్తున్నారు. మేము ఇలా వేధించాలి అనుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ నామరూపాల్లేకుండా పోయేది. కాంగ్రెస్ వేధింపులకు వడ్డీతో సహా చెల్లిస్తాం. మా నాయకులను, మా మేయర్, మా కార్పొరేటర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటాం' అని పేర్కొన్నారు.

పేదల ఇండ్లు కూల్చుడే కాంగ్రెస్ లక్ష్యమా?: ఈటల

పేదలపై దండయాత్రలు, ఇండ్లను కూల్చివేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమా? అని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఉప్పల్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియ ఎన్‌క్లేవ్‌లో కూల్చివేతలపై స్పందించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాయిప్రియ ఎన్‌క్లేవ్‌లో నిరుపేదలు ఉన్నారని, వారి ఇండ్లకు అన్నిరకాల అనుమతులు ఉన్నా ప్రభుత్వం అకారణంగా కూల్చివేసిందని మండిపడ్డారు. అవి అక్రమ భూములు అయితే ఆనాడు ఇండ్ల నిర్మాణానికి, గృహ రుణాలకు ఎలా అనుమతి ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అధికారులే అప్పట్లో అనుమతులు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారవచ్చుగానీ అధికారులు మారొద్దని హితవు పలికారు. ఈ అంశంపై కలెక్టర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదని, డిప్యూటీ సీఎం, రెవెన్యూశాఖ మంత్రులను అడిగితే తమకు తెలియదంటూ తప్పించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు క్షమాపణ చెప్పి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ వైఖరి వల్ల 300 మంది రోడ్డునపడ్డారు. కాంగ్రెస్ ఒళ్లు వంచి అధికారంలోకి రాలేదని, బీఆర్‌ఎస్‌ను ఓడించాలని మాత్రమే ప్రజలు ఓటేశారని ఎద్దేవా చేశారు.

దమ్ముంటే ప్రజాక్షేత్రంలో కొట్లాడాలి

మున్సిపాలిటీ అవిశ్వాసం నెగ్గలేక మొన్న కిడ్నాప్‌లు చేసి, నిన్న తప్పుడు కేసులు పెట్టి, నేడు అమాయక ఇండ్లపై దాడులకు పాల్పడుతున్న సుధీర్‌రెడ్డికి నిజంగా దమ్ముంటే ప్రజా క్షేత్రంలో కొట్లాడాలి. అంతేకానీ ఇలా దొడ్డిదారిలో ప్రజాప్రతినిధులను భౌతికంగా, మానసికంగా, ఆర్థికంగా నష్టం కలిగించి, హింసించాలనుకోవటం సిగ్గుచేటు. కాంగ్రెస్ ప్రభుత్వపు వేధింపులకు వడ్డీతో సహా చెల్లిస్తాం. అక్రమ కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాం. ప్రజల తరుపున పోరాటం కొనసాగిస్తాం.

- జక్కా వెంకట్‌రెడ్డి, మేయర్, పీర్జాదిగూడ

బీబీపీఎస్‌లో చేరితే ఏటా 24 కోట్ల భారం

- **ఆన్‌లైన్ చెల్లింపులతో వినియోగదారులకే నష్టం**
- **బీబీపీఎస్‌లో చేరేందుకు అనుమతి కోరిన డిస్కంలు**

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించడం వల్ల పడే చార్జీల భారాన్ని తిరిగి వినియోగదారులపై మోపేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కం)లు సిద్ధమవుతున్నాయి. ఆ మొత్తాన్ని వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేయనున్నాయి. ఇలా నెలకు 2 కోట్ల చొప్పున ఏడాదికి 24 కోట్ల భారాన్ని వినియోగదారులపై మోపనున్నాయి. విద్యుత్తు బిల్లులను ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం లాంటి థర్డ్‌పార్టీ పేమెంట్ యాప్‌ల ద్వారా చెల్లించడాన్ని విద్యుత్తు సంస్థలు ఇటీవలు నిలిపివేసిన విషయం తెలిసిందే. రిజర్వుబ్యాంకు (ఆర్బీఐ) నిబంధనల ప్రకారం ఆయా ఏజెన్సీలు భారత్ బిల్ పేమెంట్ సిస్టం (బీబీపీఎస్)లో నమోదు కాకపోవడమే ఇందుకు కారణం. కానీ, ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపుల కోసం డిస్కంలు సైతం బీబీపీఎస్‌లో నమోదు కావాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో బీబీపీఎస్‌లో చేరేందుకు అనుమతివ్వాలని కోరుతూ డిస్కంలు ఇటీవల ప్రభుత్వానికి లేఖ రాశాయి. ఈ అనుమతి లభించడం లాంఛనమే కానున్నది. విద్యుత్తు బిల్లుల చెల్లింపునకు వినియోగదారులు జరిపే ప్రతి లావాదేవీపై బీబీపీఎస్‌కు డిస్కంలు 3.50 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

ప్రస్తుతం మన రాష్ట్రంలోని విద్యుత్తు వినియోగదారుల్లో 90% కంటే ఎక్కువ మంది ఆన్‌లైన్‌లోనే బిల్లులు చెల్లిస్తున్నారు. ఆ లావాదేవీలకు బీబీపీఎస్ చార్జీలను విధించనుండటంతో వాటిని వినియోగదారులపై మోపేందుకు డిస్కంలు ప్రయత్నిస్తున్నాయి. ఆర్థికభారాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తక్కువ చార్జీ తీసుకుని బిల్లుల వసూలుకు ఇటీవల పలు బ్యాంకులు ముందుకొచ్చాయి. ఒక్కో లావాదేవీకి కేవలం రూ.2 చొప్పున తీసుకునేందుకు ఎస్‌బీఐ సంసిద్ధత వ్యక్తం చేసింది. మరికొన్ని బ్యాంకులతో డిస్కంలు చర్చలు జరుపుతున్నాయి. మరోవైపు క్యూఆర్ కోడ్ ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలు కల్పించాలని భావిస్తున్నాయి.

బదిలీ టీచర్లను రిలీవ్ చేస్తాం

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : ఇటీవల బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేస్తామని, పాఠశాలల్లో అవసరాలకు అనుగుణంగా సర్దుబాటు చేస్తామని, బదిలీల అప్పీళ్లను పరిష్కరిస్తామని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం హామీ ఇచ్చినట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, జాక్టో నేతలు తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయా సంఘాల నేతలు వెంకటేశంతో భేటీ అయి పలు అంశాలను ప్రస్తావించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు పూర్తిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపి, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నేతలు జంగయ్య, సదానందంగౌడ్, అశోక్‌కుమార్, లింగారెడ్డి, రాధాకృష్ణ, నాగిరెడ్డి, పోచయ్య, శ్రీనివాస్, కొండయ్య పాల్గొన్నారు.

బదిలీ అధికారులను వెనక్కి తేవాలి : టీజీవో

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సంఘం సూచనల మేరకు పార్లమెంట్ ఎన్నికల ముందు సుదూర ప్రాంతాలకు బదిలీ అయిన అధికారులను వెనక్కి తీసుకొచ్చి, ప్రస్తుతం జరుగబోయే బదిలీల్లో అవకాశం కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో)ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు టీజీవో ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సీఎస్ శాంతి కుమారి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రిలను కలిసి 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలను హైదరాబాద్ నగరంలో భాగంగా కాకుండా, ప్రత్యేక స్టేషన్లుగా పరిగణించి ఉద్యోగ సంఘాల బాధ్యులకు బదిలీల్లో మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీజీవో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఎనుగుల సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్, కోశాధికారి ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, పరమేశ్వర్‌రెడ్డి, నరహరిరావు, లక్ష్మణ్, శిరీష, వనజ, ఏంజిలారెడ్డి పాల్గొన్నారు.

కొత్త మెడికల్ కాలేజీలు లేనట్టే?

- **ఈ ఏడాది అనుమతులు రావటంపై సందేహం**
- **సిబ్బంది నియామకంలో సర్కారు తీవ్ర నిర్లక్ష్యం**
- **ఇప్పటికీ ఎల్వోపీ ఇవ్వని ఎంఏఆర్బీ**



హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేస్తున్న 8 మెడికల్ కాలేజీలకు అనుమతులు రావటంపై సందేహాలు నెలకొన్నాయి. సిబ్బందిని నియమించటంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో కాలేజీలకు ఇప్పటివరకు నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి అనుమతులు రాలేదు. జోగులాంబ గద్వాల, నారాయణపేట, ములుగు, మెదక్, యాదాద్రి భువనగిరి, వరంగల్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఏర్పాటయ్యే కాలేజీల కోసం ఒక్కో కాలేజీలో 50 సీట్లు కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నది. నిబంధనల ప్రకారం వసతులు ఉన్నాయో లేదో మెడికల్ అసెస్మెంట్ అండ్ రేటింగ్ బోర్డు పరిశీలించి లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇస్తుంది. నిబంధనల ప్రకారం 50 ఎంబీబీఎస్ సీట్లతో కాలేజీ ఏర్పాటు చేయాలంటే 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. మొత్తంగా 59 మంది బోధన సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. అయితే సిబ్బందిని నియమించటంలో వైద్యారోగ్య శాఖ తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. 8 కొత్త కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు, దవాఖాన సూపరింటెండెంట్లు తప్ప మిగతా సిబ్బంది నియామకం జరగలేదు. ఇటీవల ఎన్ఎంసీ బృందం తనిఖీలకు వచ్చింది. ఈ సందర్భంగా బోధన సిబ్బంది ఒక్కరు కూడా లేకపోవటంపై ఆశ్చర్యం వ్యక్తం చేసినట్టు చెప్పుకుంటున్నారు. ఈ విషయంపై ఎంఏఆర్బీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. కాలేజీల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లకు మెయిల్ ద్వారా సమాచారం అందించింది. సిబ్బంది నియామకంపైనే ప్రధానంగా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. నిబంధనల మేరకు ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను వైద్యారోగ్యశాఖ 60 రోజుల్లోగా సవరించుకోవాలి. లేకపోతే అనుమతులు ఇవ్వరు. అయితే ఆలోగా కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించి నియామక ప్రక్రియ పూర్తికావటంపై అనుమానాలు ఉన్నాయి. ఇటీవల అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినవారిని కేటాయించినా.. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల నియమాక ప్రక్రియ ఎప్పుడు ప్రారంభం అవుతుందో, ఎపుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులపై శ్రద్ధ పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని నిపుణులు చెప్తున్నారు. ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు మొదటి నుంచీ వైద్యారోగ్యశాఖకు పదే పదే గుర్తు చేస్తున్నా పట్టించుకోలేదని చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా వేగంగా స్పందిస్తుందో లేదో చూడాలని పేర్కొంటున్నారు.

లోకల్ బాకీ 3 వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి...

సంఘం ద్వారా ప్రతినెల దాదాపు రూ.400 కోట్లు పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలకు ఇవ్వాల్సి ఉండగా వాటిని నిలిపివేసింది. వందలాది జీపీల ఖాతాల్లో 20-30 వేలలోపే డబ్బుండటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతున్నది. అభివృద్ధి మాట పక్కనబెడితే కనీసం కార్మికుల జీతాలు, ట్రాక్టర్ల నిర్వహణకు కూడా దిక్కులు చూడాల్సిన దుస్థితి దాపురించింది. పారిశుద్ధ్య నిర్వహణ భారంగా మారి, పల్లెలకు మళ్లీ పాతరోజులు వచ్చాయి. పేరుకుపోతున్న చెత్త, మురుగుతో ముక్కుపుటాలు అదురుతుండగా వానకాలం కావడంతో వ్యాధులు బుసకొడుతున్నాయి.

నాడు అవార్డులు.. నేడు తారుమారు

ఒక నాడు జాతీయ స్థాయిలో అవార్డులు తీసుకున్న పల్లెలు, పట్టణాల్లో ఏడు నెలల్లోనే పరిస్థితి అంతా తారుమారైంది. ఏడు నెలలుగా జీతాలు రాకపోవడంతో పారిశుద్ధ్య కార్మికుల బతుకులు భారంగా మారాయి. జీతాలు రాకుంటే పని ఎందుకు చేయాలని చాలామంది మానేసి రోజుకూలీలకు వెళ్తుండడం కనిపిస్తున్నది. గ్రామ చిన్న చిన్న అవసరాలకు కార్యదర్శులు అప్పులు చేసి కష్టాలపాలవుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నా, మురుగు కాల్వలు, నీటి ట్యాంకులను శుభ్రం చేయాలన్నా డబ్బులు లేని దుస్థితికి పంచాయతీలు చేరుకున్నాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల కింద గత ప్రభుత్వం పట్టణాలకు నెలకు రూ.148 కోట్లు, పంచాయతీలకు నెలకు రూ.230 కోట్లు ఇచ్చేది. కేంద్రం ఇచ్చే నిధులతో సమానంగా నిధులు విడుదల చేసేది. దీంతో తెలంగాణ పంచాయతీలు అభివృద్ధికి చిరునామాగా మారి జాతీయ స్థాయి అవార్డులు సైతం అందుకున్నాయి. కాంగ్రెస్ వచ్చాక పల్లె, పట్టణ ప్రగతికి మొత్తానికే మంగళం పాడింది. బీఆర్‌ఎస్ హయాంలో ఊరూరికీ పారిశుద్ధ్య నిర్వహణ కోసం సమకూర్చిన ట్రాక్టర్లు ఇప్పుడు కనీసం డీజిల్ కూడా పోసే దిక్కులేక మూలకుపడ్డాయి. ట్రాక్టర్లు పనిచేయక, కార్మికుల జీతాలందక చెత్త సేకరించే నాథుడు లేక గ్రామాలు, పట్టణాలు కంపుకొడుతున్నాయి. అసలే వానకాలం కావడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ కేసులు విపరీతంగా నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తున్నది.

కార్యదర్శులూ అప్పులపాలు

పంచాయతీల్లో పన్నుల రూపంలో వసూలయ్యే జనరల్ ఫండ్‌ను కరెంటు బిల్లులకు చెల్లించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి తేవడంతో ఆ నిధులు వాటికే సరిపోతున్నాయని స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, కిందిస్థాయి సిబ్బంది పరిస్థితి దయనీయంగా మారిందని చెబుతున్నారు.పనులకు బిల్లులు రాక అప్పుల పాలయ్యామని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. ఫాగింగ్, బ్లీచింగ్‌కు కూడా డబ్బుల్లేవని అన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాక తాగునీరు, పారిశుద్ధ్యం, మొక్కలు, వీధిదీపాల నిర్వహణ, మరమ్మతులు చేపట్టలేకపోతున్నామని చెబుతున్నారు. ఏవైనా సమస్యలు పరిష్కారం కాకుంటే తమకు మెమోలు జారీ చేస్తున్నారని, నిధుల గురించి మాత్రం పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

అభివృద్ధి పనులకు బ్రేక్

పల్లె, పట్టణ ప్రగతి కింది చేపట్టిన వైకుంఠ ధామాలు, ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ మార్కెట్లు, ఎఫ్ఎస్‌టీపీలు, మోడ్రన్ దోబీఘాట్లకు నిధులు రాక ఇప్పటికే సగానికి పైగా పూర్తయిన నిర్మాణాలు నిలిచిపోయాయి. నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను ఆపేశారు.

ప్రభుత్వం కన్నెత్తిచూడడం లేదు

పంచాయతీలకు నిధులు రాక ఏడు నెలలైంది. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ప్రభుత్వం పట్టించుకుంట లేదు. కార్యదర్శులు జేబుల్లోంచి పెట్టలేక ఇబ్బంది పడుతున్నరు. ప్రజాప్రభుత్వంలో పాలకవర్గాలు, ప్రజాప్రతినిధి లేకుంటే గ్రామాలు ఎలా అభివృద్ధి చెందుతయ్? పల్లెల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ లేదు. ఫాగింగ్ చేసేందుకూ నిధుల్లేవు. ప్రభుత్వం కన్నెత్తి కూడా చూడడం లేదు.

- సుర్వి యాదయ్య గౌడ్, మాజీ సర్పంచ్, తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

ద్వారకానగర్ జీపీ ఖాతాలో మూడు వేలు

వనపర్తి జిల్లా మదనాపురం మండలం ద్వారకానగర్‌లో పని చేసే ఇద్దరు కార్మికులకు 8 నెలలుగా జీతాలు రాలేదు. జీపీ ఖాతాలో కేవలం రూ.3 వేలు మాత్రమే ఉండటంతో కార్యదర్శి నిస్సహాయ స్థితిలో ఉన్నాడు.

ఖాతాలో 40వేలు.. కట్టాల్సినవి 12లక్షలు

వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో 11 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేసేవారు. అంతకుముందు సక్రమంగా వచ్చిన జీతాలు ఇప్పుడు రాకపోవడంతో నాలుగు నెలల కిందట ఐదుగురు కార్మికులు మానేశారు. 'జీతాలు రాని పని మాకొద్దు' అంటూ చంద్రకళ, జానమ్మ, సత్యమ్మ, రాజు, రాములు స్వచ్ఛందంగా వదులుకున్నారు. ఇక జీపీలో రూ.40 వేలుంటే చేపట్టిన పనులకు రూ.12 లక్షలు చెల్లించాల్సి ఉన్నది.

జీతం రాక మానేసిన..

నెలల తరబడి జీతం ఇవ్వకుంటే మాలాంటి చిన్న కుటుంబాలు ఎట్ల గడుస్తయి?. వేలకు వేలు జీతాలు తీసుకునేటోళ్లే ఒకటో తారీఖున రాకుంటే లబోదిబోమంటరు. రెండు వేల జీతం మొదలు 10 ఏండ్లకుపైగా జీపీలో పనిచేసిన. ఇంతకుముందు ఓ నెల కాకపోయినా మరో నెల జీతం వచ్చేది. ఇంట్లో పూట గడవకనే మూడు నెలల కిందట ఐదుగురం పని మానేసినం.

- రాములు, పని మానేసిన కార్మికుడు, పెద్దమందడి

ఆస్తులమ్మి కట్టినం.. బిల్లులివ్వండి

- **మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం**
- **'ప్రజావాణి'లో కరీంనగర్ కలెక్టర్ ఎదుటే ఘటన**

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 8: 'అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేసినం. వడ్డీలు తడిసి మోపెడయినయ్. మా ఆస్తులు అమ్మి కట్టినం. అయినా మాకు ప్రభుత్వం బిల్లులివ్వడం లేదు' అని ఆవేదన వ్యక్తంచేస్తూ కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఓ మాజీ సర్పంచ్ భర్త ఆత్మహత్యకు ప్రయత్నించడం కలకలం సృష్టించింది. కలెక్టర్ పమేలా సత్పతి ఎదుటే తువాలతో గొంతు బిగించుకోవడంతో ఆమె ఒక్కసారిగా హతాశయురాలయ్యారు. పోలీసులు అడ్డుకొని అతడిని బయటకు లాక్కెళ్లారు. రామడుగు మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల భర్త జగన్‌గౌడ్ గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, రూ.65 లక్షలు బిల్లులు రావాల్సి ఉన్నది. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగిన జగన్ గౌడ్, ప్రజావాణిలో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆయనతోపాటు వచ్చిన రామడుగు, గంగాధర మండలాల మాజీ సర్పంచులు సైతం ఆందోళనకు దిగగా పోలీసులు సముదాయించి పంపారు.

రుణమాఫీకి భూముల తాకట్టు!

మొదటిపేజీ తరువాయి...

సమీకరించాలని గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మర్చంట్ బ్యాంకర్ కోసం గత నెల 23న టెండర్లు పిలిచింది. 'సాంకేతిక కారణాలు, లోపాలు' వంకతో పది రోజుల తర్వాత టెండర్లను రద్దు చేసింది. రూ.5వేల కోట్లు సేకరించినా రుణమాఫీ పూర్తికి సరిపోకపోవడం, మొత్తం నిధులు రుణమాఫీకే ఖర్చు చేస్తే సెప్టెంబర్ నుంచి రాష్ర్టాన్ని నడపడం కష్టంగా మారుతుందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరించినట్టు సమాచారం. దీంతో ప్రభుత్వం 'భూముల తనఖా'తో అధిక నిధులు సేకరించాలని నిర్ణయించినట్టు తెలిసింది. తాజాగా మళ్లీ టెండర్లు పిలిచింది. రూ.10వేల కోట్లు నిధులు సమీకరించాలనుకుంటున్నట్టు చెప్తున్నారు. ఇందులో రూ.5వేల కోట్లు రుణమాఫీకి ఆగస్టు 15లోగా, మిగతావి సెప్టెంబర్ చివరికి సమీకరించేలా ప్లాన్ వేసినట్టు సమాచారం.

బిల్లుల చెల్లింపులు బంద్

రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు అవసరమవుతాయని ఇప్పటికే అధికారులు అంచనా వేశారు. ఇందులో రూ.20 వేల కోట్లను రుణాల రూపంలో సేకరిస్తున్నట్టు సమాచారం. మిగతా రూ.10 వేల కోట్లను రాష్ర్టానికి వచ్చే ఆదాయం నుంచి తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే కాంట్రాక్టర్ల బిల్లులతోపాటు జీపీలకు పట్టణ స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన రూ.600 కోట్లు ఆపినట్టు చెప్తున్నారు. రెండు నెలలుగా పింఛన్లు ఇవ్వలేదనే విమర్శలున్నాయి.

ఇప్పటికే 28 వేల కోట్ల అప్పు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు రూ.28 వేల కోట్ల రుణాలు సేకరించింది. రుణమాఫీ కోసం చేసే అప్పుతో అది దాదాపు రూ.50 వేల కోట్లకు చేరుతుందని అధికారులు చెప్తున్నారు.

పరిశ్రమలొస్తే భూములు ఎక్కడిస్తరు?

కోకాపేట, రాయదుర్గం ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పైగా.. కొత్తగా వచ్చే ఐటీ కంపెనీలు అటువైపే చూస్తున్నాయి. అలాంటిచోట 400 ఎకరాలు ప్రైవేట్ సంస్థలకు తనఖా పెట్టడం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ ప్రయోజనాలకు తాకట్టు పెడితే.. వాటిని ఎప్పుడు విడిపిస్తారు? అని ప్రశ్నిస్తున్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న భూ చట్టాల నిపుణుడు సునీల్‌కుమార్

యాచారంలో 'భూ న్యాయ శిబిరాలు' పూర్తి

10 గ్రామాల్లో 5 నెలలపాటు అధ్యయనం చేసిన లీఫ్స్

హైదరాబాద్, జూలై 8 (నమస్తే తెలంగాణ): భూ సమస్యలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు పూర్తయిందని లీఫ్స్ సంస్థ తెలిపింది. రైతుల సమస్యలను గుర్తించేందుకు భూ చట్టాల నిపుణుడు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో లీఫ్స్ 10 గ్రామాల్లో అధ్యయనం చేసింది. సంస్థ న్యాయవాదులు గ్రామాలకు వెళ్లి 'భూ న్యాయ శిబిరాలు' ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం మంథని గౌరెల్లిలో చివరి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. తాము ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మాట్ ద్వారా దరఖాస్తులు తీసుకున్నామని తెలిపారు. రైతులను పిలిపించుకొని, వారి వద్ద ఉన్న పత్రాల ఆధారంగా నివేదికలు తయారు చేసినట్టు వెల్లడించారు. 10 గ్రామాల్లో 2,200 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రతి సమస్యకు నివేదికను సిద్ధం చేస్తున్నామని, వాటిని మంత్రి పొంగులేటికి సమర్పించనున్నట్టు చెప్పారు. ధరణి కమిటీ సభ్యుడు కోదండరెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు, ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొస్తున్నామని వివరించారు. లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్‌రెడ్డి, కొంపెల్లి మల్లేశ్, ప్రవీణ్, ఈరుగు రవి తదితరులు పాల్గొన్నారు.